సాక్షి ప్రకాశం

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



నవరత్నాలు..పేదలకు వరాలు

సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు పేదలకు వరాల వంటివని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

- 8లో..



సమాజానికి దోహదపడేలా సైన్స్ ప్రాజెక్టులు

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు ఒంగోలులో ఆసక్తికరంగా సాగాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లా ఉత్తమ గ్రామ వలంటీర్‌గా రామకృష్ణారెడ్డి



రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామానికి చెందిన వల్లేల రామకృష్ణారెడ్డి జిల్లా ఉత్తమ గ్రామ వలంటీర్‌గా ఎంపికైనట్లుగా ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. జేపీ చెరువు సచివాలయంలో గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న వల్లేల రామకృష్ణారెడ్డి వైఎస్సార్ ఆసరా ప్రోగ్రాంలో వంద శాతం విధులు నిర్వహించడంతో పాటు తనకు కేటాయించిన 50 నివాస గృహాలకు సంబంధించిన లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలను సకాలంలో పంపిణీ చేస్తున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించడం ద్వారానే జిల్లా ఉత్తమ గ్రామ వలంటీర్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 15న గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే ఉత్తమ వలంటీర్ల సేవా పురస్కారాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వల్లేల రామకృష్ణారెడ్డి పురస్కారాన్ని తీసుకుంటున్నట్లుగా ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. అంతేకాక మండలంలోని యడవల్లి సచివాలయం పరిధిలోని బైర్ల దివాకర్ బాబు మండల ఉత్తమ గ్రామ వలంటీర్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించే సినిమాలు రావాలి

- 'జబరజంగి' టైటిల్ లాంచింగ్‌లో అజయ్ ఘోష్



'జబరజంగి' సినిమా టైటిల్ లాంచ్ చేస్తున్న అజయ్ ఘోష్

ఒంగోలు టౌన్: ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించే సినిమాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీనటుడు అజయ్ ఘోష్ అన్నారు. ఒంగోలులో ఎన్నో లఘు చిత్రాలు నిర్మించిన సుహారి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తొలిసారిగా నిర్మించిన ఇండిపెండెంట్ సినిమా 'జబరజంగి' టైటిల్ లాంచింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినిమా నిర్మాత నున్న హరిప్రియ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో అజయ్ ఘోష్ మాట్లాడుతూ.. మా భూమి, అంకురం లాంటి ఎన్నో గొప్ప చిత్రాలు నిర్మించిన ఘనత తెలుగు సినిమాకు ఉందన్నారు. ఒంగోలుకు తెలుగు సినిమా పరిశ్రమలో మంచి గౌరవం ఉందని, ఇక్కడ నుంచి వచ్చిన కళాకారులు సామాజిక స్పృహ కలిగి ఉంటారని చెప్పారు. ఒంగోలుకు చెందిన సుహారి సంస్థ నుంచి వస్తున్న 'జబరజంగి' ఒక మంచి సినిమాగా నిలిచిపోతుందన్న నమ్మకం ఉందన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకొని ఏప్రిల్ లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు దర్శకుడు నాయుడు పిన్నింటి తెలిపారు. కార్యక్రమంలో రచయిత సాయిరాంకృష్ణ, ఫొటోగ్రాఫర్ శశాంక్, కో డైరెక్టర్ రవితేజ, నటులు సురేష్ సాధనాల, దాసరి శ్రీనివాసరావు, రామకృష్ణ, మోహన్, వెంకటేష్, బొడ్డు సురేష్, సలీం బాష, ఫరూక్, రాజేష్, చిన్న, శ్రీనివాస్, వెంకటేష్, రమేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో అదరగొట్టారు..

మారుమూల గ్రామాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టేందుకు ప్రభుత్వం నిర్వహించిన మెగా టోర్నీ ''ఆడుదాం ఆంధ్రాలో'' జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నాలుగు పతకాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. మహిళల విభాగంలో మూడు, పురుషుల విభాగంలో ఒక పతకాన్ని సాధించారు. మహిళల విభాగం ఖోఖోలో విజేతగా నిలవగా, కబడ్డీలో రన్నరప్‌గా, క్రికెట్‌లో సెకండ్ రన్నరప్‌గా, పురుషుల విభాగం ఖోఖోలో సెకండ్ రన్నరప్‌గా నిలిచారు మన క్రీడాకారులు. విశాఖలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఖోఖో విజేత ట్రోఫీ అందుకుంటున్న ప్రకాశం బాలికల జట్టు

- ఆడుదాం ఆంధ్రాలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి మహిళల ఖోఖో మనదే
- కబడ్డీలో ద్వితీయ, క్రికెట్‌లో తృతీయ స్థానం
- పురుషుల ఖోఖో తృతీయ స్థానం
- ఇల్లూరి హేమవతి ప్రతిభను గుర్తించిన ఏపీ ఖోఖో అసోసియేషన్
- సీఎం చేతులమీదుగా బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాడ 'ఆడుదాం ఆంధ్రా'' పోటీలు జిల్లాలో 50 రోజుల పాటు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. క్రీడల నిర్వహణకు జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. గత ఏడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 9వ తేదీ వరకూ 717 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించారు. ఇందుకు 557 క్రీడా స్థలాలను అందుబాటులోకి తెచ్చారు. మైదానాలను చదునుచేయడం, ఆడుకునేందుకు వీలుగా పలు సౌకర్యాలు కల్పించారు. దీంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జరిగిన క్రీడా సంబరాలు అంబరాన్ని అంటాయి. పోటీల నిర్వహణను 400 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించగా ప్రతి సచివాలయం పరిధిలో ఆసక్తి కలిగిన 10 మంది క్రీడా వలంటీర్ల సాయంతో పోటీలను పకడ్బందీగా నిర్వహించారు. సచివాలయాల స్థాయిలో విజేతలతో 2024 జనవరి 10 నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయిలో, జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయిలో, జనవరి 31 నుంచి ఈ నెల 3 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి విజేతలకు వైజాగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రిజిస్టర్ చేసుకున్న వారికి ఆడుదాం ఆంధ్రా టీ షర్టులు, టోపీలు అందించారు. సచివాలయ స్థాయి విజేతలకు అంటే మండల స్థాయిలో పోటీ పడేవారికి బేసిక్ కిట్లను అందించారు. మండల స్థాయి విజేతలు అంటే నియోజకవర్గ స్థాయిలో పోటీపడే వారికి ప్రొఫెషనల్ కిట్లను అందించారు. నియోజకవర్గ, జిల్లా విజేతలకు నగదు బహుమతులు ఇచ్చారు. ఈ నెల 3వ తేదీన జిల్లా స్థాయి పోటీలు ముగిశాయి. మహిళలు, పురుషుల విభాగాలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడల్లో పది జట్లు రాష్ట్ర స్థాయి టీలకు ఎంపికయ్యాయి.

రాష్ట్ర స్థాయి విజేతలు..

కనిగిరి పట్టణం పోలిరెడ్డి బజార్ సచివాలయం ఖోఖో మహిళల జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి ట్రోఫీని సొంతం చేసుకుంది. కబడ్డీ మహిళల విభాగంలో సింగరాయకొండ మండలం పాకల సచివాలయం-2 జట్టు ద్వితీయ స్థానం, క్రికెట్‌లో జరుగుమల్లి మండలం చిరికూరపాడు సచివాలయం మహిళా జట్టు తృతీయ స్థానం, అలాగే పురుషుల విభాగం ఖోఖోలో సంతనూతలపాడు మండలం రుద్రవరం సచివాలయం జట్టు తృతీయ స్థానాన్ని సాధించాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేత జట్టుకు రూ.5 లక్షలు, ద్వితీయ రూ.3 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2 లక్షలు అందించారు. ఇదిలా ఉండగా కనిగిరి పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారిణి ఇల్లూరి హేమవతి ప్రతిభను గుర్తించిన ఏపీ ఖోఖో అసోసియేషన్ ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసింది.



కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



ఖోఖోలో తృతీయ స్థానం పొందిన జిల్లా బాలుర జట్టు



క్రికెట్‌లో మూడో స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు

ఆ అద్భుత క్షణాలు



కనిగిరి పరిధిలోని పోలిరెడ్డి బజార్ సచివాలయం పరిధిలో పేరు రిజిస్టర్ చేసుకున్నా. తండ్రి శివశంకరరెడ్డి కూరగాయల వ్యాపారి. కనిగిరి ఎంఎస్ఎం డిగ్రీ కాలేజీలో మూడో సంవత్సరం బీఏ చదువుతున్నా. రాష్ట్ర స్థాయి పోటీలకు తమ జట్టు ఎంపిక కావడంతో పాటు సీఎం చేతులమీదుగా అవార్డు అందుకోవడం చెప్పలేని ఆనందాన్ని ఇచ్చింది. నేను గతంలోనే చాలా ఆటల పోటీల్లో ప్రావీణ్యాన్ని కనబరిచా. చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ లోని జబల్పూర్, రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఆటల పోటీల్లో మంచి పేరు తెచ్చుకున్నా. పుణెలో జరిగిన జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో కూడా పాల్గొన్నా. కానీ నేడు మా సచివాలయం జట్టు రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన అద్భుత క్షణాన్ని మరువలేను. అంతేకాదు నన్ను ఏపీ ఖోఖో అసోసియేషన్ ఎంపిక చేసుకుని ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉంది.

– ఇల్లూరి హేమవతి, కనిగిరి

అది మా అదృష్టం



నేను జరుగుమల్లి మండలం చిరికూరపాడు సచివాలయం పరిధిలో పేరు రిజిస్టర్ చేసుకున్నా. నా తల్లిదండ్రులు ఇద్దరూ రోజువారీ కూలీలే. 2018లో అండర్ 16 సౌత్‌జోన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించినా అనంతరం క్రీడల జోలికి వెళ్లలేదు. అయితే ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభిస్తుండడంతో మా సచివాలయం పరిధిలోని వలంటీర్లు నాలో ఉత్సాహాన్ని నింపారు. నాలాంటి వారందరం కలిసి ఒక టీముగా ఏర్పడి పోటీలకు సై అన్నాం. కానీ రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలవడం నిజంగా మాకు లభించిన అదృష్టంగా భావిస్తున్నాం. ఆడపిల్లలకు సరైన అవకాశాలు లభిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నిరూపించాం.

– పొట్లూరి ఉమామహేశ్వరి, చిరికూరపాడు, జరుగుమల్లి మండలం

కొండపి అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): కొండపి నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ఎవరూ చేయని విధంగా మండలాల వారీగా ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసి అమలు చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ సుల్తాన్ దుకాణం వద్ద, వైస్ ఎంపీపీ షేక్ షకీల ఇంటివద్ద ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఇన్‌చార్జిగా నియమించారని, అప్పటి నుంచి ఇక్కడి ప్రజల బాధ్యత తనపై ఉందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నానన్నారు. ప్రధానంగా తాగునీరు, సాగునీటి సమస్య ఉందన్నారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేయటానికి కృషి చేస్తానని, సింగరాయకొండ మండల ప్రజలకు ప్రధాన సాగునీటి వనరైన పాలేరు–బిట్రగుంట స్కీం సప్లయ్ చానల్ అభివృద్ధికి కృషి చేస్తానని, జిల్లెళ్లమూడి వద్ద రిజర్వాయర్‌లో ఇసుక పూడిక తీయించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. మండలంలో ప్రధాన సమస్య అయిన దేవస్థాన భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరిస్తానని, అవసరమైతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఇందుకోసం అదనంగా రామతీర్థం జలాలు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. తనపై ఉన్న నమ్మకంతో జగనన్న రెండుసార్లు మంత్రి పదవి ఇచ్చారని, ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించానని తెలిపారు. కొండపిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయటమే జగనన్న లక్ష్యమని దాన్ని సాధిద్దామన్నారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, షేక్ పటేల్, పీ శ్రీనివాసులరెడ్డి, షేక్ సలీంబాషా, షేక్ సలీం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి



కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున

- రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున
- సంతనూతలపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్ష

ఒంగోలు అర్బన్: సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, నియోజవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో కలిసి రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో తహశీల్దార్లతో నియోజకవర్గంలో కార్యక్రమాల పురోగతిపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనిలో మేరుగు నాగార్జున మాట్లాడుతూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నియోజకవర్గ పరిధిలో చేపట్టిన డ్రైన్స్, రోడ్లు తదితర అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హత ఉండి ఇంటి స్థలం పట్టాల కోసం 90 రోజుల కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి ఇంటి పట్టాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు క్షేత్ర స్థాయిలో దృష్టి సారించి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అంశాల ప్రతిపాదనలు పంపాలన్నారు. ఒంగోలు నుంచి సంతనూతలపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలోని అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు ప్రారంభించని పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాలు ఖాళీగా ఉంటే అర్హులైన దరఖాస్తుదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కొండయ్య, మర్దన్ అలీ, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, పాల్గొన్నారు.

జేఈఈలో సత్తా చాటారు



వాసా వెంకట ఆకాష్ రెడ్డి

ఒంగోలు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కొత్తపట్నం మండలం ఆకుల అల్లూరుకు చెందిన వాసా నారాయణరెడ్డి, కవితల కుమారుడు వాసా వెంకట ఆకాష్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఫిజికల్స్ 100 పర్సంటైల్, గణితంలో 100 పర్సంటైల్, కెమిస్ట్రీలో 99.9353169 పర్సంటైల్ సాధించాడు. మొత్తంగా ఈ పరీక్షలో 99.9994951 పర్సంటైల్ సాధించాడు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీసరస్వతి విజయాలు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏ.వీ రామణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కాలేజీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కె.సాకేత్ సాయిరాం 98.24 పర్సంటైల్, ఆర్.చంద్రవిహారిక 97.57, కె.సాయికిరణ్ 97.45, కె.గోపీచంద్ 97.40, ఎస్.ఇంద్రసేనారెడ్డి 95.32 సాధించి జిల్లా స్థాయిలో మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. 90 పర్సంటైల్ పైన 14 మంది, 80 పర్సంటైల్ పైన 46, 70 పర్సంటైల్ పైన 123 మంది నిలిచారని, జేఈఈ అడ్వాన్స్‌కు 170 మంది క్వాలిఫై అవుతారని తాము అంచనా వేస్తున్నామని పేర్కొంటూ ఇందుకు కారకులైన విద్యార్థులకు, విద్యా సంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్ రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్‌లను అభినందించారు.



జేఈఈ మెయిన్స్‌లో రాణించిన విద్యార్థులతో శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

జేఈఈ మెయిన్స్‌లో రాణించిన శ్రీప్రతిభ విద్యార్థులు

ఒంగోలు: జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో తమ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కాలేజీలో మంచి ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 98.38, 98.25 పర్సంటైల్ సాధించారని, 97 పర్సంటైల్ పైన 8 మంది, 96 పర్సంటైల్ పైన 12 మంది సాధించారన్నారు. ఫిజిక్స్‌లో 96.18 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. మొత్తంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలో అన్ని సబ్జెక్టుల్లో కలిపి పుట్లూరి గోవర్ధన్ 96.47, రావి మహేష్ చౌదరి 95.739, గట్టమనేని మోహితాసాయి 95.50, తోట వెంకట అవినాష్‌నాయుడు 92.75, గుండారెడ్డి ప్రయాంక 92.27, సందికంటి వెంకట తరుణ్‌కృష్ణ 92.27 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు కాలేజీ వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణలను ఆయన అభినందించారు.

సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ఏపీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మార్కాపురంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనపై నమ్మకముంచి కీలకమైన ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టి రాష్ట్రాభివృద్ధిలో తనవంతు కృషిచేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులకు కూడా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, లబ్ధిదారులకు కూడా తెలపాలని చెప్పారు.

జంకెతో ఎమ్మెల్యే రాంబాబు సమావేశం

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నా రాంబాబు మంగళవారం ఉదయం జంకె నివాసానికి వెళ్లి ఏపీఐఐసీ చైర్మన్‌గా నామినేట్ అయినందుకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం కాసేపు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, నాగరాజు గౌడ్, కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, బాల సుబ్బారావు తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాంబాబును, జంకె వెంకటరెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.



జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానించిన వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

నేడు దర్శిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

● ముఖ్య అతిథులుగా బాలినేని, చెవిరెడ్డి, జంకె

దర్శి: దర్శి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి హాజరవుతున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన దద్దాల నారాయణ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: కలెక్టర్ దినేష్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ఒంగోలులో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను, అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌కు విన్నవించారు. నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి(బన్నీ), జెడ్పీటీసీలు మడతల కస్తూరి రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, కల్లూరి రామిరెడ్డి, సర్పంచ్ కటికల వెంకట రత్నం, దాదిరెడ్డి మాలకొండారెడ్డి తదితరులున్నారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం



గంజాయి చాక్లెట్లను విక్రయించే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సెబ్ సీఐ మారయ్య

చీమకుర్తి: మండలంలోని బూదవాడ గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న గంజాయి చాక్లెట్లను సెబ్ సీఐ మారయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సీఐకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా బీహార్‌కు చెందిన రమేష్ సహాని గ్రానైట్ క్వారీల్లో పనిచేసే కార్మికులకు కేంద్రంగా చేసుకొని గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ.10 వేల విలువైన 540 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బీహార్ వాసి రమేష్ సహానికి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్సై వినీతా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

నవరత్నాలు.. పేదలకు వరాలు

● పార్టీలకతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు
● ఎటువంటి ఇబ్బందులున్నా నేరుగా కలవండి
● ఎన్నికలు వస్తేనే చంద్రబాబుకు పథకాలు గుర్తుకు వస్తాయి
● శివరాజనగర్ ఎన్నికల ప్రచారంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
● దర్శి గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా : జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ప్రచారంలో పాల్గొన్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: దర్శి గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా అని, నియోజకవర్గంలో జగనన్న పాలనపై ప్రజాభిమానం చూస్తుంటే 50వేలకు పైగా మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. దర్శిలోని శివరాజనగర్‌లో మన ఊరు–మనశివన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందరూ తమకు పథకాలు వస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తారని స్థానికులు శివప్రసాద్‌రెడ్డికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ,శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ముఖ్య ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రతి పేదవాని ఇంటికి నేరుగా సంక్షేమ పథకాల ఫలాలు చేరాలన్న ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా నేరుగా కలిసి చెప్పుకుంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చంద్రబాబుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారు..

చంద్రబాబుకు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు, పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. ఎన్నికలప్పుడు ఇష్టం వచ్చినట్లు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోవడం చంద్రబాబు నైజమని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తు పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం భాషా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ విమల రామకృష్ణ, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, చల్లా నారాయణరాజు, వడ్డెర సంఘం అధ్యక్షుడు తన్నీరు సుబ్బారావు, వార్డు ఇంచార్జ్‌లు, దొంత ఏడుకొండలు, బత్తుల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, వట్టి సుబ్బారెడ్డి, కరిపిరెడ్డి రమణారెడ్డి, దొంత ఏడుకొండలు, పోరుమామిళ్ల శ్రీనుగౌడ్, ముప్పూరి బ్రహ్మయ్య, ఎస్‌కే ఖాశీం, సయ్యద్ పెద్దఖాశీం, పోరుమామిళ్ల శ్రీనుగౌడ్ ముప్పూరి బ్రహ్మయ్య, బత్తుల నాసరయ్య, దేవండ్ల పెద్దమాలకొండయ్య, బత్తుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

● వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్



సమావేశానికి భారీగా హాజరైన మహిళలు



మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: పేదరిక నిర్మూలనకు అహర్నిశలూ కృషి చేస్తూ సంక్షేమ పథకాలతో ఆర్థిక సమానత్వాన్ని తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచారని వై.పాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి చంద్రశేఖర్‌తో పాటు మహిళలు క్షీరాభిషేకం చేశారు. మండల పరిధిలో 551 గ్రూపులకు 5557 మంది లబ్ధిదారులకు రూ.3,18,23,227 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చట్లమిట్ల గ్రామానికి చెందిన గంజి సుబ్బారెడ్డికి రూ.2 లక్షలు చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. మహిళలకు రుణమాఫీ నుంచి విముక్తి కలిగించిన జగనన్నను ఆదరించాలని కోరారు. గతంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేశారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని, దాని కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా తదితర నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. మోసం చేయడం చంద్రబాబు నైజం అయితే చెప్పిన మాటకు కట్టుబడి శిత్తశుద్ధితో హామీలు అమలు చేయడం జగనన్న నైజమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయని చెప్పారు. టన్నెల్ సొరంగ తవ్వకంలో టీడీపీ నాయకులు, దళారులు, పెత్తందారులు దోపిడీ చేయడంతో పాటు దోచుకుని ఏటీఎం లాగా చేశారని ఎద్దేవా చేశారు. మన ప్రాంతానికి కావాల్సినది వెలిగొండ ప్రాజెక్టు వరం లాంటిదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని భరోసా ఇచ్చారు. మూడు జిల్లాల్లో వ్యవసాయానికి 4.50 లక్షల ఎకరాలు సాగు నీరు, 15.30 లక్షల మందికి తాగునీరు అందించే ప్రాజెక్టు అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంతానికి సాగు, తాగునీటి కష్టాలు ఉండేవి కావని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించి ఎంత మేరకు ట్యాంకర్లు లేక అవసరమైతే బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. నాడు–నేడు పథకం ద్వారా విద్య వ్యవస్థ సమూలమైన మార్పు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో 10 ఫిషింగ్ హార్బర్లు, 5 షిప్ యార్డులు, 17 మెడికల్ కళాశాలలు నిర్మాణం చేపట్టిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంటలో రూ.371 కోట్లు తిని అడ్డంగా సీబీఐ అధికారులకు దొరికిపోయారని ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ దాస్, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ కుందురు లక్ష్మీరెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, పార్టీ జిల్లా సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, సర్పంచులు బెజవాడ అదాం, అంగిరేకుల ఆదినారాయణ, పాలగిరి రామాంజనేయరెడ్డి, ఎంపీటీసీలు దుదెకుల పకీరయ్య, నాయకులు మూల సత్యంరెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, ఎం. రాజారావు, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పాతిరెడ్డి నారప రెడ్డి, పంది గురవయ్య, వెన్నా పెద్దపోలిరెడ్డి, పోటు గంగయ్య, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, బత్తుల సాలయ్య, గొట్టం వెణుగోపాలరెడ్డి, నరాల రామచంద్రుడు, సొంటి నాగార్జునరెడ్డి, షేక్ బుజ్జి, వజ్రాల ఆదిరెడ్డి, ఒద్దుల లక్ష్మీరెడ్డి, గాలి రమణారెడ్డి, దుద్దెల వెంకటరెడ్డి, పిల్లి రంగారెడ్డి, బలుసుపాటి నాగరాజు, ఎంపీటీసీలు, పాదుపు సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అద్భుతం

● జర్మనీ బృందం కితాబు



శనగ పంటను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

కొత్తపట్నం: తీరానికి దగ్గరలో కొత్తపట్నం మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు అద్భుతంగా ఉందని జర్మనీ దేశ ప్రతినిధి బృందం అభినందించారు. మండలంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పంట పొలాలను రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ టి.విజయకుమార్, జర్మనీ నుంచి వచ్చిన బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తపట్నంలో కషాయాలతో ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పురిణి మల్లేశ్వరి వేరుశనగ పంటను పరిశీలించారు. పక్కనే పురిణి వెంకటేశ్వర్లు రసాయన ఎరువులతో సాగు చేస్తున్న వేరుశనగ, చామదుంప పంటలను పరిశీలించి తేడాను గుర్తించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. ఎంత మంది ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్నారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జర్మనీ దేశ టీం లీడర్ ఫెపానికుచ్ మాట్లాడుతూ మండలంలో ప్రకృతి వ్యవసాయంలో సాగును ఎక్కడా చూడలేదన్నారు. ఇదే విధంగా ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. నూరు శాతం ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలని సూచించారు. ఇక్కడ అమలు చేస్తున్న విధానాన్ని మా దేశంలో కూడా అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బృంద సభ్యులు మతియస్, జార్జ్‌నదొల్, స్మిత్ జాకబ్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన శ్రీనివాసరావు, వెంకట్రావు, సత్యనారాయణ, ఏట మోహన్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవాలు విజయవంతం చేయాలి

త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు విజ్ఞప్తి



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ సుబ్బారావు

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాలను త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు కోరారు. శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద అధికారుల సమీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు అసౌకర్యం కలగకుండా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, త్రిపురాంతకం గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, ఎంపీడీవో సాంబశివరావు మాట్లాడుతూ ఆలయాల వద్ద తాగునీటి వసతి, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులు తెలిపారు. రెండు వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి లక్ష్మీదేవి తెలిపారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు, రథోత్సవం, రద్దీకి తగిన క్యూలైన్లు, చలువ పందిర్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా ఉభయ ఆలయాల అభివృద్ధికి రూ.2.30 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఎంపీఐ మాధవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబు, సీఐ సుబ్బారావు, విద్యుత్ డీఈ నాగేశ్వరరావు, ఏఈ సురేష్‌రెడ్డి, ఏఈ నీలిమ తమ శాఖల పరిధిలో చేపట్టే చర్యలను వివరించారు. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 28న ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ట వివరాలను అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి వెల్లడించారు. డీటీ భ్రమరాంబ, సీపీఐ నాయకుడు శ్రీనివాస్, అర్చకుడు ప్రసాదశర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి, గోపిశెట్టి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, యామర్తి ఆదిలక్ష్మి, ఆర్ఐ ముకుంద హరి, ఎస్ఐ సాంబశివయ్య, బోర్డు మాజీ సభ్యులు, సుబ్బారావు, మల్లికార్జున్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



యాత్ర-2 సినిమా వీక్షిస్తున్న బాలినేని, పార్టీ నేతలు

‘యాత్ర-2’ వీక్షించిన బాలినేని

ఒంగోలు: నిత్యం అభివృద్ధి పనులు, రాజకీయ వ్యవహారాల్లో తలమునకలయ్యే మాజీ మంత్రిచ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం సరదాగా కనిపించారు. ఒంగోలులోని కృష్ణా థియేటర్‌లో యాత్ర-2 సినిమాను సతీమణి శచీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి బాలినేని వీక్షించారు.

కూలీల ఆటో బోల్తా

● యువకుడు మృతి, పలువురికి గాయాలు



మృతి చెందిన యేసురాజు

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఉయ్యాల యేసురాజు(29) మృతి చెందాడు. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..దర్శి మండలం పాపిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని సంఘానికి చెందిన కూలీలు మిరప కోత పనికి ఆటోలో మండలంలోని పూరిమెట్లకు వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా మార్గ మధ్యలో ఉమామహేశ్వరపురం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఉయ్యాల యేసురాజు, చౌటూరి కొండమ్మ, వెంకటేశ్వరమ్మకి తీవ్ర గాయాలు కాగా ఒంగోలుకి తరలిస్తుండగా మార్గమధ్యంలో యేసురాజు మృతి చెందాడు. ఏసురాజు స్వగ్రామం పల్నాడు జిల్లా వినుకొండ మండలం నడిగడ్డ కాగా గత కొంతకాలంగా సంఘంలో బంధువుల వద్ద నివాసం ఉంటున్నాడు. తుపాకుల వెంకాయమ్మ, మల్లీశ్వరీ, పావని, చలంచర్ల బుల్లిమ్మ, దుర్గ, రామకృష్ణ, సుబ్బమ్మ, బూదూరి జాలావతిలకు గాయాలయ్యాయి. వీరందరినీ అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బతుకుదెరువు కోసం వచ్చి ప్రమాద బారిన పడిన వారంతా రోజువారి కూలీలు కావడంతో గాయపడిన వారి కుటుంబసభ్యులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. మృతుడు ఏసురాజు తండ్రి మునయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యువీ కృష్ణయ్య తెలిపారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు!

పొదిలి రూరల్: కంది రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర సివిల్ సప్లయ్ మార్కెటింగ్ మేనేజర్ శిరీష సూచించారు. పొదిలి మండలం పాములపాడు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయట మార్కెట్‌లో ఉన్న ధరకే రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కందులు కొనుగోలు చేస్తోందన్నారు. వాటిని కందిపప్పు రూపంలో ప్రజలకు పంపిణీ చేస్తారన్నారు. కందుల కొనుగోలుకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.7500 ప్రకటించిందని చెప్పారు. అయితే రైతులు కందులు విక్రయించే నాటికి మార్కెట్‌లో ఉన్న ధరనే చెల్లిస్తామన్నారు. సంచులు, రవాణా ఖర్చులు ప్రభుత్వం తిరిగి రైతులకు చెల్లిస్తుందన్నారు. అనంతరం పొలాలకు వెళ్లి పంటను పరిశీలించారు. ఆమె వెంట జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.



ఆటోమాటిక్ డ్రైనేజీ క్లీనింగ్ సిస్టమ్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న సీఎస్‌పురం విద్యార్థి హరికృష్ణ



రివర్ వాటర్ క్లీనింగ్ రోబో ప్రదర్శిస్తున్న కారుమంచి విద్యార్థి గౌతమ్‌రాజ్

సమాజానికి దోహదపడేలా సైన్స్ ప్రాజెక్టులు

● ఇన్‌స్పైర్–మనక్‌లో 79 ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులు
● రాష్ట్ర స్థాయి పోటీలకు 8 ఎంపిక
● విద్యార్థులను అభినందించిన డీఈఓ సుభద్ర



సేవ్ లైఫ్ ఇన్ మెడికల్ ఎమర్జెన్సీ ప్రాజెక్ట్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



డిజిటల్ స్టెతస్కోప్ ప్రదర్శిస్తున్న యర్రగొండపాలెం విద్యార్థిని రాణి



సోలార్ విద్యుత్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న విద్యార్థులు

ఒంగోలు: జిల్లా స్థాయి ఇన్‌స్పైర్–మనక్‌లో చిన్నారులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు బాగున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర ప్రశంసించారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల ప్రదర్శన మంగళవారం ఒంగోలులోని ఆగ్జీలియం అఖిల వికాస్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 79 మంది విద్యార్థులు తమ నైపుణ్యంతో రూపొందించిన ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయన్నారు. సైన్స్‌పై విద్యార్థులు మరింత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులు ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన 8 ప్రాజెక్టులకు మరింత మెరుగులు దిద్ది జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి, ఎంఈఓ కిషోర్ బాబు, డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి రమేష్ తదిరతులు పాల్గొని పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన 8 ప్రాజెక్టులు ఇవే..

1.ఎకోఫ్రెండ్లీ బయో డీగ్రేడబుల్ పాట్స్ ఫర్ ప్లాంట్స్–కొండెపోగు బుజ్జి(బేస్తవారిపేట కేజీబీవీ)

2. ఫార్మర్ ఫ్రెండ్లీ ఫీల్డ్ కవర్–జి.శ్రీనివాసులు(బేస్తవారిపేట జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల)

3. ఇన్‌క్లెన్ట్ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ వాటర్ టాప్స్ ఎట్ పబ్లిక్ ప్లేసెస్–కుందురు యశ్వంత్‌రెడ్డి(తిప్పాయపాలెం జెడ్పీహెచ్ఎస్)

4. రెయిన్ ప్రొటెక్షన్ ఫర్ అగ్రికల్చర్ ఫీల్డ్స్–కందుకూరి సుమశ్రీ(మాధవరం జెడ్పీహెచ్ఎస్)

5. ఫార్మింగ్ వితవుట్ సాయిల్–బేగ్ మహీనిన్(ఒంగోలు నలంద ఇంగ్లిష్ మీడియం స్కూల్)

6. హియరింగ్ త్రూ టీత్–దమ్మాల విష్ణువర్థన్(మంగమూరు జెడ్పీహెచ్ఎస్)

7. బగ్ కిల్లింగ్ స్ట్రీట్ లైట్–కె.బ్రహ్మాంజనేయులు(వెలిగండ్ల జెడ్పీహెచ్ఎస్)

8. హ్యాండ్ టాక్ సిస్టం బై యూజింగ్ మెమ్స్ టెక్నాలజీ–పలుకూరి వినయ్(కృష్ణవేణి ఉన్నత పాఠశాల)